'కేఎల్ఆర్' అధ్యాపకుడికి అవార్డు

అవార్డు అందుకుంటున్న వెంకట రమేష్

పాల్వంచ, డిసెంబర్ 24: స్థానిక కేఎల్ఆర్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న వెంకట రమేష్‌కు ఆసియా టుడే మీడియా ప్రైవేట్ లిమిటెడ్ నుంచి ప్రతిష్టాత్మకమైన 'మోస్ట్ అడ్మైర్డ్ అకడమిక్ అడ్వైజర్' అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని తాజ్ దక్కన్ హోటల్‌లో జరిగిన 'ప్రైడ్ ఆఫ్ నేషనల్ అవార్డ్స్-2024' కార్యక్రమంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నుంచి అవార్డును అందుకున్నారు. ఆయనకు కేఎల్ఆర్ విద్యాసంస్థల చైర్‌పర్సన్ కె.నాగమణి, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం

దమ్మపేట రూరల్: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

దమ్మపేట రూరల్, డిసెంబర్ 24: రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానిస్తూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వ్యాఖ్యానించడాన్ని నిరసిస్తూ ఆయన దిష్టిబొమ్మను మంగళవారం సీపీఎం నాయకులు దహనం చేశారు. మండలంలో ముష్టిబండ జాతీయ రహదారిపై జరిగిన ఈ కార్యక్రమంలో మోరంపూడి శ్రీనివాసరావు, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటాలతో నిరసన

కొత్తగూడెం అర్బన్: అంబేద్కర్ చిత్రపటాలతో నిరసన తెలుపుతున్న నాయకులు

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 24: అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట అంబేద్కర్ చిత్రపటాలతో నిరసన తెలిపారు. యెర్రా కామేష్, తడికల శివకుమార్, గంధం మల్లికార్జున్‌రావు, శనగ వెంకటేశ్వర్లు, పాక వెంకటేశ్వర్లు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పెనగడప గ్రామంలో సింగరేణి సీఎండీ

రామవరం, డిసెంబర్ 24: సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని ప్రభావిత గ్రామమైన పెనగడపలో సీఎండీ ఎన్.బలరాం మంగళవారం పర్యటించారు. సింగరేణి ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ పనులను పరిశీలించారు. సంబంధిత అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. డైరెక్టర్లు, జీఎంలు వెంకటేశ్వర్‌రెడ్డి, సుభాని, శాలెంరాజు, సుబ్బారావు, కార్మిక నాయకులు రాములు(ఏఐటీయూసీ), రజాక్(ఐఎన్‌టీయూసీ) తదితరులు పాల్గొన్నారు.

పీసా చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

గ్రామసభలో మాట్లాడుతున్న ఈవో మహేష్

బూర్గంపహాడ్, డిసెంబర్ 24 : గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం ఏర్పడిన పీసా చట్టంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సారపాక పంచాయతీ ఈవో కంది మహేష్ అన్నారు. మంగళవారం పంచాయతీ కార్యాలయం ఆవరణలో పీసా డేలో భాగంగా పీసా గ్రామసభను ఏర్పాటు చేశారు. ప్రతిఒక్కరూ ఈ చట్టాన్ని ఉపయోగించుకోవాలన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, బానోతు శ్రీను, కృష్ణ, పేరాల శ్రీనివాసరావు, శంకర్, గిరిజనులు, పలు పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చండ్రుగొండ, డిసెంబర్ 24: చండ్రుగొండ గ్రామ పంచాయతీలో సెక్రటరీ రాజేందర్ అధ్యక్షతన మంగళవారం పీసా గ్రామ సభ జరిగింది. సమస్యలపై దరఖాస్తులను ఎంపీడీవో అశోక్ స్వీకరించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు కొణకండ్ల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ రూరల్, డిసెంబర్ 24: మండలంలోని పాండురంగాపురం తండాలో మంగళవారం పీసా గ్రామసభ జరిగింది. గ్రీన్ ఎర్త్ సొసైటీ వ్యవస్థాపకుడు రమేష్ రాథోడ్, పంచాయతీ కార్యదర్శి కాళీ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం

స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, డిసెంబర్ 24 : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో సీతారాముల నిత్యకల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాతసేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర పూజలు నిర్వహించారు. గాలిగోపురానికి అభిముఖంగా ఉన్న ఆంజనేయస్వామివారికి ఉదయం పంచామృతాభిషేకం చేసి తమలపాకులు, సింధూరంతో పూజలు చేశారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

మావోయిస్టు అమరుల స్మారక స్థూపాలు కూల్చివేత

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 24 : మావోయిస్టుల స్మారక స్థూపాలను కూల్చివేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు ఛత్తీస్‌గఢ్ పోలీస్ అధికారులు. సుక్మా జిల్లాలో మావోయిస్టు ప్రభావిత గోమగూడ మైదాన ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకున్న ఐదు అమరవీరుల స్మారక స్థూపాలను పోలీస్ బలగాలు ధ్వంసం చేశాయి. ఈ ఆపరేషన్స్‌లో డీఆర్‌జీ, జిల్లా రిజర్వు గార్డు, ఎస్‌టీఎఫ్, కోబ్రా, సీఆర్‌పీఎఫ్ భద్రతా దళాలు పాల్గొన్నాయి. ఈ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ క్యాంప్‌పై సోమవారం మావోయిస్టులు మెరుపు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ప్రాంతాన్ని మావోయిస్టులు కేంద్రంగా చేసుకుని తమ కార్యకలాపాలు జరుపుతున్న నేపథ్యంలో ఆపరేషన్ 'కగార్' విస్తృతంగా కొనసాగుతోంది. మావోయిస్టుల చర్యలను తిప్పికొట్టడంతో భాగంగా సుక్మా రేంజ్ సీఆర్‌పీఎఫ్ డీఐజీ ఆనంద్ సింగ్, సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ గోమగూడ క్యాంప్ వద్దే బస ఏర్పాటు చేసుకుని, వారి పర్యవేక్షణలోనే అడవులను జల్లెడ పడుతున్నారు.

ఉమ్మడి జిల్లాపై 'అల్పపీడనం' ప్రభావం

పలు మండలాల్లో చిరుజల్లులతో కూడిన వర్షం

అశ్వారావుపేట రూరల్ : ఇటుకలు తడవకుండా పరదాలు కప్పిన దృశ్యం

అన్నపురెడ్డిపల్లిలో ధాన్యంపై కప్పిన పరదాలు

ఖమ్మం వ్యవసాయం/కూసుమంచి/అన్నపురెడ్డిపల్లి/అశ్వారావుపేట రూరల్, డిసెంబర్ 24 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం ఉమ్మడి ఖమ్మం జిల్లాపై పడింది. ఇప్పటికే పొరుగునున్న ఆంధ్రప్రదేశ్‌లోని ఖమ్మం జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ ప్రభావం ఉమ్మడి ఖమ్మం జిల్లాపై కూడా స్వల్పంగా పడింది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం నుంచి సూర్యుడి జాడ కరువైంది. దీంతో జిల్లాలో దట్టమైన మేఘాలు అలుముకున్నాయి. మధ్యాహ్నం తరువాత ఖమ్మం నగరంతోపాటు పలు మండలాల్లో ఈదురుగాలులతో కూడిన జల్లులు కురిశాయి. దీంతో అప్రమత్తమైన అన్నదాతలు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు ఉరుకులు పరుగులు పెట్టారు. ప్రస్తుతం వరి, పత్తి పంటలు ఇప్పటికే చేతికొచ్చాయి. మరికొద్ది రోజుల్లో మిర్చి పంట కూడా చేతికి రానుంది. ఇదే సమయంలో తుఫాన్ ప్రభావం ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇక ఈ అల్పపీడనం కారణంగా ఒకవైపు చలి తీవ్రత పెరుగుతోంది. మరోవైపు ఈదురుగాలులతో కూడిన జల్లులు కురుస్తున్నాయి. ఉదయం నుంచి మబ్బులు పట్టి ఉన్న వాతావరణం ఒక్కసారిగా చల్లబడి మధ్యాహ్నం తరువాత చిరుజల్లులు కురవడంతో కూసుమంచి, అన్నపురెడ్డిపల్లి, అశ్వారావుపేట మండలాల రైతులు అప్రమత్తమయ్యారు. పలు గ్రామాల్లోని రైతులు వెంటనే కల్లాలకు పరుగులు పెట్టారు. అక్కడున్న తమ ధాన్యం తడవకుండా వాటిపై పట్టాలు కప్పారు. కొన్ని చోట్ల ఆరబెట్టిన ధాన్యాన్ని ఏకంగా బస్తాల్లోకి ఎత్తి తడవని ప్రాంతాల్లోకి తరలించారు.

అశ్వారావుపేట రూరల్ : వరి పనలను కట్టలు కడుతున్న రైతులు

అశ్వారావుపేట రూరల్ : తీసిన వేరుశనగ

ట్రైబల్ మ్యూజియాన్ని సందర్శించిన కలెక్టర్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

భద్రాచలం, డిసెంబర్ 24 : భద్రాచలంలో ముక్కోటికి వచ్చే భక్తులకు ట్రైబల్ మ్యూజియంలో కళాఖండాలు తెలిసేలా, గిరిజన ఆచార సంప్రదాయాలు ఉట్టిపడేలా ఏర్పాట్లు ఉండాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియంను సందర్శించారు. దేవస్థానం, కరకట్ట ప్రదేశం నుంచి ఐటీడీఏ ట్రైబల్ మ్యూజియం, బొజ్జిగుప్ప గ్రామాలకు భక్తులు వెళ్లేలా సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో దామోదరరావు, ఐటీడీఏ ఏవో సున్నం రాంబాబు, ఏసీఎంవో రమణయ్య, ఏటీడీవో అశోక్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, డీఎస్‌వో ప్రభాకరరావు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

అశ్వారావుపేట టౌన్: సమ్మె నోటీస్ ఇస్తున్న కార్మికులు

అశ్వారావుపేట టౌన్, డిసెంబర్ 24: తమ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ నెల 27, 28 తేదీల్లో టోకెన్ సమ్మె నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్మిక సంఘం (సీఐటీయూ) నాయకులు మంగళవారం ఎంపీవో ప్రసాదరావుకు నోటీస్ ఇచ్చారు. వెంకట్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట రూరల్, డిసెంబర్ 24: టోకెన్ సమ్మెను పంచాయతీ కార్మికులు జయప్రదం చేయాలని కార్మిక సంఘాల జేఏసీ కోరింది. దమ్మపేటలో మంగళవారం జరిగిన ఈ సమావేశంలో నాయకులు ధర్మా, పిట్టల అర్జున్, బసవయ్య పాల్గొన్నారు.

ములకలపల్లి, డిసెంబర్ 24: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు మంగళవారం ఎంపీడీవో రేవతికి వినతిపత్రం ఇచ్చారు. ఈ నెల 27, 28 తేదీల్లో సమ్మె చేయనున్నట్లు చెప్పారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు సిక్కుల శ్రీనివాసరావు, పంచాయతీ కార్మిక సంఘం నాయకులు గంట శ్రీనివాసరావు, రుక్మాంధరరావు, రమేష్, రాజు, గడ్డ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ.. అందరి బాధ్యత: డీఎఫ్‌వో

మాట్లాడుతున్న డీఎఫ్‌వో కృష్ణగౌడ్

ఆళ్లపల్లి, డిసెంబర్ 24: అడవులను సంరక్షించడం మన అందరి బాధ్యత అని ఎఫ్‌డీవో కృష్ణగౌడ్ అన్నారు. ఆళ్లపల్లి మండలంలో మంగళవారం పర్యటించిన ఆయన.. అడవి రామావరం పంచాయతీకి బయలుదేరారు. రోడ్డుమార్గం లేని ఈ గ్రామానికి అధికారులు, సిబ్బందితో కలిసి పయనమయ్యారు. 12 కిలోమీటర్లు బైక్‌పై ప్రయాణించి అక్కడికి చేరుకున్నారు. తరువాత గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవులను నరికి పోడుగా మార్చకూడదని, భావితరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించేందుకు అందరమూ కృషి చేయాలని సూచించారు. అడవులను నాశనం చేస్తే మానవ మనుగడకు ప్రమాదం వాటిల్లుతుందని వివరించారు. అటవీ అధికారులు కోటేశ్వరరావు, చలపతి, నరసింహారావు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భద్రాచలం, డిసెంబర్ 24 : పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ ఈవో శ్రీనివాస్‌కు మంగళవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ సమ్మె నోటీసు అందజేశారు. కార్మికులకు వేతనాలు పెంచాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని కోరారు. ఈ నెల 27, 28 తేదీల్లో జరిగే సమ్మెకు ప్రభుత్వం స్పందించకుంటే జనవరి 5 తర్వాత నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంబి.నర్సారెడ్డి, శరత్‌బాబు, రవి, చెన్నకేశవులు, కార్మికులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణా తరగతులు

సరుకులు అందజేస్తున్న సెక్యూరిటీ జీఎం

కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 24: వారం రోజులపాటు జరిగిన ఎస్‌అండ్‌పీసీ సెక్యూరిటీ సిబ్బంది 33వ బ్యాచ్ ఫస్ట్ ఎయిడ్ అండ్ ఫైర్ ఫైటింగ్ శిక్షణా తరగతులు మంగళవారం ముగిశాయి. ఈ సిబ్బంది కొనుగోలు చేసిన నిత్యావసర సరుకులను స్థానిక అనాథ శరణాలయానికి అందించారు. ఏరియా సెక్యూరిటీ అధికారి ఎండీ జాకీర్ హుస్సేన్, ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, జూనియర్ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మునగ సాగుతో అధిక లాభాలు

మునగ సాగును పరిశీలిస్తున్న రవికుమార్, చంద్రశేఖర్‌రెడ్డి

దమ్మపేట, డిసెంబర్ 24: మునగ సాగుతో రైతులు అధిక లాభాలు సాధించవచ్చని సహాయ వ్యవసాయ సంచాలకుడు రవికుమార్, మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ రెడ్డి చెప్పారు. మండలంలోని నల్లకుంట ఏరియాలో తాళ్ల శంకర్‌రావుకు చెందిన మునగ సాగును మంగళవారం పరిశీలించారు. రైతులతో ఆయన మాట్లాడుతూ.. సన్న, చిన్నకారు రైతులకు మునగ సాగు వరమని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించవచ్చని అన్నారు. మునగ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందన్నారు. ఏడు నుంచి ఎనిమిది నెలల్లో మునగ కాయ దశకు వస్తుందని చెప్పారు. మునగ సాగుతో ఎకరానికి రూ.75వేలకు పైగా ఆదాయం ఉంటుందన్నారు.

180 లీటర్ల నాటుసారా స్వాధీనం

స్వాధీనం చేసుకున్న నాటుసారాతో ఎక్సైజ్, పోలీసు, సీఆర్‌పీఎఫ్ పోలీసులు

భద్రాచలం, డిసెంబర్ 24 : ఉమ్మడి ఖమ్మంజిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ గణేష్ ఆధ్వర్యంలో ఆంధ్ర, తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో నాటుసారా తయారీ, విక్రయాలపై మంగళవారం ఎక్సైజ్, పోలీసు, సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో సంయుక్త దాడులు నిర్వహించారు. ఆంధ్రాకు చెందిన ఎటపాక మండలంలోని గుండువారిగూడెం, పిచ్చుకలపాడు గ్రామాల్లో 180 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని 18,500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.మధు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి.కరంచంద్, అధికారులు నాగరాహుల్, రహీమున్నీసాబేగం, రమేష్, శ్రీనివాసరావు, ఇంద్రజిత్, సిబ్బంది పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

టేకులపల్లి, డిసెంబర్ 24: గిరిజన ఆశ్రమ పాఠశాల్లోని కాంట్రాక్ట్ టీచర్లకు సమాన పనికి సమాన వేతనాన్ని ప్రభుత్వం చెల్లించేలా చూడాలని కోరుతూ ఎమ్మెల్యే కోరం కనకయ్యకు నాయకులు. మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. వారు మంగళవారం మండలంలోని కోయగూడెం గ్రామంలో ఎమ్మెల్యేను ఆయన ఇంటిలో కలిశారు. వినతి పత్రం ఇచ్చారు. హరిలాల్, కన్నా, భూక్యా లక్ష్మణ్ నాయక్, భూక్యా మంగీలాల్, రాందాస్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మ రక్షణ

టేకులపల్లి, డిసెంబర్ 24: ఆడ పిల్లలు స్వీయ రక్షణ కోసం కరాటే నేర్చుకోవడం అవసరమని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మెరుగు శ్రీనివాస్ అన్నారు. 'ఆడ పిల్లల ఆత్మ రక్షణ' కార్యక్రమాన్ని ఆయన మంగళవారం కరాటే మాస్టర్ మొగిలితో కలిసి ప్రారంభించారు. కరాటే నేర్చుకుంటే స్వీయ రక్షణకు ఉపయోగపడుతుందని, ఆత్మ విశ్వాసం పెరుగుతుందని వివరించారు. ఉపాధ్యాయులు భారతి, పుష్పావతి, పీడీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మతి స్థిమితం లేని వ్యక్తి హల్‌చల్

మతి స్థిమితం లేని వ్యక్తిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

అశ్వారావుపేట, డిసెంబర్ 24: మతి స్థిమితం లేని ఓ వ్యక్తి.. హల్‌చల్ చేయడంతోపాటు పోలీసులపై దాడికి దిగాడు. పట్టణంలోని సబ్ సెంటర్-3 ఉద్యోగి అరుణ, మంగళవారం భోజన విరామ సమయంలో బ్యాంక్ వద్దకు వెళ్లారు. అదే సమయంలో ఆ సబ్ సెంటర్‌కు మతి స్థిమితం లేని ఓ వ్యక్తి వచ్చాడు. టేబుల్‌పై ఉన్న ట్యాబ్‌ను ఎత్తుకెళ్లాడు. బ్యాంక్ నుంచి సబ్ సెంటర్‌కు తిరిగొచ్చిన అరుణకు ట్యాబ్ కనిపించలేదు. ఆమె పోలీసులకు సమాచారమిచ్చారు. లొకేషన్ ఆధారంగా సబ్ సెంటర్ సమీపంలోని శిథిల భవనంలో ఆ ట్యాబ్ ఉన్నట్లుగా గుర్తించారు. అక్కడికి వెళ్లేసరికి, మతి స్థిమితం లేని వ్యక్తి వద్ద ఆ ట్యాబ్ ఉంది. దానిని ఇవ్వాలని అడిగిన పోలీసులతో అతడు వాగ్వివాదానికి దిగాడు. పోలీసులపై, స్థానికులపై రాళ్లు, కర్రతో దాడికి దిగాడు. కానిస్టేబుల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అతడిని పోలీసులు చుట్టముట్టి అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి ట్యాబ్‌ను స్వాధీనపర్చుకున్నారు.

ఇళ్ల కేటాయింపుపై హైకోర్టులో వాదనలు

భద్రాచలం, డిసెంబర్ 24 : భద్రాచలం పట్టణంలో డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులపై సోమవారం హైకోర్టులో వాదనలు జరిగాయి. హైకోర్టు సీనియర్ న్యాయవాది పీవీ కృష్ణమాచారి తన వాదనలు వినిపించారు. గతంలోనే డబుల్ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక జరిగిందని, ఆ జాబితాను కాదని మళ్లీ కొత్తగా జాబితా తయారుచేయడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

ఉపాధి కల్పించాలని సీఎండీకి వినతి

చుంచుపల్లి, డిసెంబర్ 24: మండలంలోని ఓసీ నిర్వాసిత గ్రామమైన పెనగడప ఉమ్మడి పంచాయతీలోని నిరుద్యోగ యువతకు ఉపాధి చూపాలని కోరుతూ సీఎండీ బలరాంకు కొత్తగూడెం నియోజకవర్గ మైనార్టీ సంఘం జనరల్ సెక్రటరీ పఠాన్ మహ్మద్ ఖాన్ మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఇక్కడి నిరుద్యోగ యువతకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

జూలూరుపాడు, డిసెంబర్ 24: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని వెంగన్నపాలెం గ్రామ యువకుడు నీరజ్, మహబూబాద్ జిల్లా డోర్నకల్ గ్రామ యువకుడు ఆదిత్య కలిసి మంగళవారం కొత్తగూడెం నుంచి జూలూరుపాడు వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. ఖమ్మం నుంచి కొత్తగూడెం వైపు కారు వెళుతున్నది. పడమటనర్సాపురం గ్రామ సమీపంలోని డబుల్ బెడ్‌రూం ఇండ్ల సముదాయం వద్ద ద్విచక్ర వాహనాన్ని, ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. నీరజ్, ఆదిత్య కాళ్లు విరిగాయి. వారిని కొత్తగూడెం ఆసుపత్రికి పోలీసులు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ట్రాక్టర్

పాల్వంచ రూరల్, డిశంబర్ 24: ట్రాక్టర్ ఢీకొనడంతో ద్విచక్ర వాహన చోదకుడికి తీవ్ర గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. చర్ల మండలం పూజారిగూడేనికి చెందిన కుర్ల రాము, భద్రాచలం ఐటీడీఏలో పనిచేస్తున్నాడు. ఆయన మంగళవారం కలెక్టరేట్‌లో పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై చర్ల వెళుతుండగా, నాగారం వద్ద ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. రాముకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆయన కుటుంబీకులకు సమాచారమిచ్చి, భద్రాచలంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ బోడ చంటిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

బీఆర్ఎస్ నాయకుడి మాతృమూర్తి మృతి

జూలూరుపాడు, డిసెంబర్ 24: బీఆర్ఎస్ ఆధికార ప్రతినిధి లకావత్ గిరిబాబు మాతృమూర్తి లకావత్ లక్ష్మి(68) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. స్వగ్రామమైన మాచినేనిపేట తండాలో మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్, సీపీఎం రాష్ట్ర నాయకుడు కాసాని ఐలయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు లేళ్ల వెంకటరెడ్డి, నాయకులు వేల్పుల నర్సింహారావు, మంగీలాల్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిబాబును, కుటుంబీకులను పరామర్శించారు.

వైద్యుల నియామక దరఖాస్తులకు ఆహ్వానం

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 24: భద్రాచలం ప్రాంతీయ ఆస్పత్రి, మణుగూరు ప్రాంతీయ ఆస్పత్రి, అశ్వారావుపేట ప్రాంతీయ కార్యాలయం, పాల్వంచ సామాజిక ఆరోగ్య కేంద్రంలో పని చేసేందుకు స్త్రీ వైద్య నిపుణులు, పిల్లల వైద్య నిపుణులు, జనరల్ పిజీషియన్, జనరల్ సర్జన్ నియామకానికి (ఒప్పంద పద్ధతి) దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5.00 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

'1104' యూనియన్‌లో ఎక్కువమంది మనోళ్లే

కేటీపీఎస్ కమిటీ సభ్యులు

పాల్వంచ, డిసెంబర్ 24: తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్-1104 రాష్ట్ర కమిటీని హైదరాబాద్‌లోని కార్యాలయంలో జరిగిన సమావేశం ఎన్నుకుంది. పాల్వంచ కేటీపీఎస్‌కు చెందిన నాయకుల్లో ఎక్కువమంది ఈ కమిటీకి ఎన్నికయ్యారు. అధ్యక్ష, కార్యదర్శులుగా కోటేశ్వరరావు, వి.దుర్గాశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యాసయ్య, అడిషనల్ సెక్రటరీగా ఎ.కుశలవరెడ్డి ఎన్నికయ్యారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో తత్కాల్ చేరికలు

పాల్వంచ, డిసెంబర్ 24: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ నిర్వహిస్తున్న టెన్త్, ఇంటర్ కోర్సుల్లో తత్కాల్ చేరికలకు ఈ నెల 30 వరకు గడువు ఉందని స్టార్ చిల్డ్రన్స్ హైస్కూల్ ఏఐకో-ఆర్డినేటర్ భాస్కర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యాసంవత్సరానికి ఇదే చివరి అవకాశమని పేర్కొన్నారు. వార్షిక పరీక్షలకు కేవలం నాలుగు నెలలు మాత్రమే ఉందని తెలిపారు. మరింత సమాచారానికి 98668 06532 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

ప్రభుత్వాసుపత్రి తనిఖీ

ఇల్లెందు, డిసెంబర్ 24: స్థానిక ప్రభుత్వాసుపత్రిని ఎమ్మెల్యే కోరం కనకయ్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేవారు. వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డయాలసిస్ సెంటర్‌ను, ల్యాబ్‌ను పరిశీలించారు. రోగులను పరామర్శించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హర్షవర్ధన్, ఆర్ఎంవో డాక్టర్ రామ్ నివాస్ తదితరులు పాల్గొన్నారు.

లకావత్ కుటుంబానికి పరామర్శ

తార్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

బూర్గంపహాడ్, డిసెంబర్ 24 : మండల పరిధిలోని అంజనాపురం గ్రామానికి చెందిన జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ తండ్రి లకావత్ వెంకటేశ్వర్లు గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మంగళవారం లకావత్ వెంకటేశ్వర్లు నివాసానికి వెళ్లి తార్యను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వాలియా, ముని, లాలా, చంద్రు, పవ